క్లుప్తంగా

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో విద్యుత్ తీగలు తగిలి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పాల కొండూరుకు చెందిన గడ్డి ట్రాక్టర్ శనివారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.60వేల విలువైన గడ్డి కాలిపోయింది. అలాగే ఈ మంటలకు ట్రాక్టర్ డ్రైవర్ బి.రాజేష్ వీపు కాలిపోయింది. మంటలకు ట్రాక్టర్ కూడా పాక్షికంగా కాలింది. సమాచారం అందుకున్న గుడివాడ ఏడీఎఫ్ జె.ఆంజనేయులు తమ అగ్ని మాపక బృందంతో రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదం రోడ్డు పక్కనే చోటు చేసుకోవటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

బోనస్ ప్రకటనపై పాల సంఘాల అధ్యక్షుల హర్షం

గుడ్లవల్లేరు: కృష్ణా మిల్క్ యూనియన్ బోనస్ ప్రకటనపై పాల సంఘాల అధ్యక్షులు వేమవరం పాల కేంద్రంలో శనివారం హర్షం వ్యక్తం చేశారు. పాడి రైతులకు బాసటగా నిలిచేందుకు 2024–25 సంవత్సరానికి గాను మూడో విడత బోనస్‌గా డిసెంబర్ 2024 – 2025 మార్చి నెలలకు గాను ఏప్రిల్లో రూ.18కోట్లు ఇచ్చేందుకు పాలకవర్గం నిర్ణయం తీసుకుని ప్రకటించడంపై మండలంలోని వివిధ పాల సంఘాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబుకు కృతజ్ఞతలు తెలిపారు

నవధాన్యాల సాగుతో ప్రయోజనాలు

ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయ సాగులో నవధాన్యాల సాగు చేపడితే అనేక ప్రయోజనాలు చేకూరుతాయని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని బొమ్మినంపాడులో నవధాన్యాల సాగుపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ప్రధాన పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు అందుతాయని తెలిపారు. నేల గుల్లబారి వాన పాములు అభివృద్ధి చెందడంతో పాటు నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు.

లింగాలలో విత్తన కిట్ల తయారీ

మండవల్లి: మండలంలోని లింగాలలో డివిజన్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పీఎండీఎస్ పచ్చిరొట్ట పైర్ల పెంపకం కోసం 22 రకాల విత్తన కిట్లను శనివారం తయారు చేశారు. ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ మధుబాబు, ఎంటి అగస్టిన్ పచ్చిరొట్ట పైర్ల ఉపయోగాలు వివరించారు. మండల ఇన్‌చార్జిలు గౌతమ్‌కుమార్, నాగవిజయ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం



గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఎన్‌టీయూ కాకినాడ ప్రొఫెసర్ పి. ఉదయ్ భాస్కర్ జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పట్టుదల, కృషి ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కళాశాల కరస్పాండెంట్ కోదండరామయ్య, డైరెక్టర్ కల్యాణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

కైకలూరు: ఆలపాడు పంచాయతీలో అక్రమ కట్టడాల తొలగింపు ఉద్రిక్తంగా మారింది. రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఏడు ఇళ్లకు సంబంధించిన ఆక్రమణలను శనివారం తొలగించారు. ఆలపాడు నుంచి పెంచికలమర్రు వెళ్లే రహదారిలో చెరువు టర్నింగ్ వద్ద ప్రభుత్వ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి గృహాలు, దుకాణాలు నిర్మించారనే ఫిర్యాదుపై తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం శనివారం ఉదయం వచ్చారు. సర్వేయర్లతో రోడ్డు మధ్య నుంచి ఇరువైపుల ఆరు మీటర్ల పరిధిని విభజించి ఆక్రమణలు తొలగించారు. సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ, ఎస్ఐలు వెంకట్‌కుమార్, శ్రీనివాసు, రాంబాబు, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

కళారత్న అవార్డుకు రవి బాలకృష్ణ ఎంపిక

కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠం వైస్ ప్రిన్స్‌పాల్ చింతా రవి బాలకృష్ణ కళారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఉగాదిని పురస్కరించుకుని ప్రతి ఏడాది వివిధ రంగాల్లో నిష్ణాతులైన కళాకారులకు అందజేసే కళారత్న అవార్డులు కూచిపూడి నాట్యంలో నిష్ణాతులైన ఐదుగురు కళాకారులను వరించాయి. చింతా రవి బాలకృష్ణతో పాటు కూచిపూడికి చెందిన హైదరాబాదులో ఉంటున్న డాక్టర్ పసుమర్తి వెంకటేశ్వరశర్మ, విజయవాడకు చెందిన భాగవతుల సొమ్య, హైదరాబాదుకు చెందిన నెమలిగంటి స్వర్ణలతతో పాటు గుంటూరుకు చెందిన కాజా వెంకట సుబ్రమణ్యం ఎంపికయ్యారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మృతి

కైకలూరు: ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ కిడ్నీ సంబంధిత వ్యాధితో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆయన మండవల్లి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

కొల్లేటి గ్రామాల
రహదారులు అస్తవ్యస్తం

- వర్షం వస్తే రోడ్లపై ఉన్న గుంతల్లో నిలుస్తున్న నీరు
- వాహనచోదకులకు ఇక్కట్లు

మండవల్లి: మండలంలోని కొల్లేటి గ్రామాల్లో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. పలు గ్రామాల్లో వర్షం కురిస్తే వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించే అవకాశం లేదు. పెనుమాకలంకలో రోడ్లు అధ్వానంగా మారాయి. నందిగామలంక నుంచి పెనుమాకలంకకు వెళ్లే రహదారులు దారుణంగా ఉండడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పెనుమాకలంక చర్చి వద్ద రహదారి పరిస్థితీ అంతే. వర్షం కురిస్తే రహదారులపై ఉన్న గుంతలలో నీరు నిలిచి వాహనచోదకులు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



గుంతలమయంగా మారిన నందిగామలంక-పెనుమాకలంక రహదారి

రహదారులను అభివృద్ధి చేయాలి



ఇంగలిపాకలంక–పెనుమాకలంక రహదారిలో శ్రీరామనగర్ కాలనీలో రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. రాకపోకలు సాగించడానికి వీలు పడటం లేదు. వెంటనే రోడ్లను అభివృద్ధి చేసి ప్రజలు రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలి.

– ఎల్ఎస్ భాస్కరరావు, మండవల్లి

పెనుమాకలంకలో అధ్వానం



పెనుమాకలంకలో రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం కురిస్తే వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించే అవకాశం లేదు. చర్చి వద్ద రహదారి మరింత అధ్వానంగా ఉంది. దీనిని అభివృద్ధి చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

– మన్నేపల్లి ఆదాం, మండవల్లి

నిధులు వచ్చాక అభివృద్ధి చేస్తాం

ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు వచ్చిన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపడతాం. శ్రీరామనగర్, పెనుమాకలంక గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– నాని, పీఆర్ ఏఈ

పలు రంగాల్లో నిష్ణాతులకు ఉగాది పురస్కారాలు

పామర్రు: ఘంటసాల కళాపీఠం వారి ఆధ్వర్యంలో పలు రంగాల్లో నిష్ణాతులైన వారికి ఉగాది పురస్కారాలను శనివారం అందజేశారు. స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష,కార్యదర్శులు కాటూరి వెంకటమురళీకృష్ణ, నందిపాటి హేమంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవలందిస్తున్న పోలీస్ అధికారులకు, గ్రామ ప్రముఖులకు ఈ పురస్కారాలను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. పామర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీ సుభాకర్, పామర్రు, పెదపారుపూడి మండలాల ఎస్ఐలు రాజేంద్రప్రసాద్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పామర్రు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, సర్కిల్ రైటర్ వేణుగోపాలరావు, రాజబాబు, చిమట సూర్యనారాయణ, బొగ్గరపు సాయిబాబు, బడే కేశవరావు, ఘంటసాల త్రివిక్రమ సాయిరాంలకు ఉగాది పురస్కారాలను అందజేసి వారిని ఘనంగా సత్కరించారు.



వివిధ రంగాల్లో నిష్ణాతులకు పురస్కారాలను అందజేసిన ఘంటసాల కళాపీఠం సభ్యులు

నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివార్ల ఉత్సవ మూర్తులు



భక్తులకు అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆదివారం స్వామివార్లకు వేద పండితులు మాస కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం దేవస్థాన ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తెలిపారు.

వెంకన్నకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. తొలుత స్వామికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను వేద పండితులు చేపట్టారు. స్వామి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు.

పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలి

మొవ్వ: వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందని ఏడీఏ ఎస్ శ్యామల పేర్కొన్నారు. ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ 2025 కార్యచరణ ప్రణాళికపై మొవ్వ వెలుగు కార్యాలయంలో మండల స్థాయి సమావేశం, అవగాహన సదస్సును ఏఓ శివప్రసాద్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం జిల్లా శిక్షకులు జి.గంగరాజు పెరటి తోట పెంపకం, విత్తన గుళికలు, ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్ తయారీ విధానాలను తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, పకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జిలు అచ్చిమాంబదేవి, విజయభాస్కర్‌రెడ్డి, వీఓఏలు, వీఏఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ శ్యామల

4న ఇంజినీరింగ్ కాలేజీ వార్షికోత్సవం

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ 27వ వార్షికోత్సవం వచ్చే నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.రాంజీ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని పేర్కొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

నందివాడ: పోక్సో చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి జి. సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని తమిరిశ జెడ్పీహెచ్ పాఠశాల్లో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలికలను వివిధ రకాల వేధింపుల నుంచి రక్షించేందుకు పోక్సో చట్టాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సులో ఎంపీడీఓ మల్లీశ్వరి, తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, ఎస్ఐ కే శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం కేవీ ప్రసాద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సుబ్రహ్మణ్యం

3 నుంచి కబడ్డీ పోటీలు

పమిడిముక్కల: బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బీజేఆర్ యూత్ ఆధ్వర్యంలో కపిలేశ్వరపురం గ్రామంలో ఏప్రిల్ 3,4,5 తేదీల్లో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పమిడిముక్కల, ఉయ్యూరు, తోట్లవల్లూరు, కంకిపాడు, పామర్రు మండలాల స్థాయిలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ.700 చెల్లించాలని తెలిపారు. ఏ గ్రామానికి చెందిన వారు ఆ గ్రామం తరపున పోటీలో పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆధార్ కార్డు తీసుకుని రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు మహేంద్ర 99515 84489, సాయ కిరణ్ 7997239682లో సంప్రదించాలని పేర్కొన్నారు.

2న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పమిడిముక్కల: మండలంలో బీసీ, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల రెండో తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. బీసీ, ఈబీసీలకు కలిపి మొత్తం 72 యూనిట్లు మంజూరు కాగా 572 మంది దరఖాస్తు చేసుకొన్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు గురజాడ, మంటాడ, మర్రివాడ, తాడంకి, వేల్పూరు, గోపువానిపాలెం, కపిలేశ్వరపురం, కూడేరు, మేడూరు శ్రీరంగపురం గ్రామాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆలీనఖీపాలెం, ఐనపూరు, కృష్ణాపురం, లంకపల్లి, పెనుమత్స, చోరగుడి, అగినపర్రు, అమీనపురం, ఫతేలంక, హనుమంతపురం, ఐనంపూడి, మామిళ్లపల్లి, ముళ్లపూడి, పమిడిముక్కల, వీరంకి గ్రామాల లబ్ధిదారులకు అధికారులు, బ్యాంకర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నూరు శాతం పన్ను వసూలే లక్ష్యం

కూచిపూడి(మొవ్వ): పంచాయతీలకు రావాల్సిన పన్ను బకాయిలను ఈ నెల 31వ తేదీ నాటికి వందశాతం వసూలు చేయడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జిల్లా పంచాయతీ ప్రధాన అధికారి డాక్టర్ జె.అరుణ తెలిపారు. మొవ్వ మండలం కూచిపూడి పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి పంచాయతీలకు రావాల్సిన పన్ను బకాయి వసూళ్లపై మండలంలోని 21 పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 497 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూలు వేగవంతంగా జరుగుతోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 84.65 కోట్లు వసూలు చేయడం లక్ష్యంగా ఉండగా, ఇప్పటివరకు రూ. 61.44 కోట్లు వసూలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ డివిజన్ పంచాయతీ అధికారి సంపత్‌కుమారి, మొవ్వ ఈఓపీఆర్డీ పరమాత్మ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి వివాదం కేసులో ఇద్దరి అరెస్ట్

పమిడిముక్కల: మంటాడ గ్రామంలో ఆస్తి వివాదంలో ముగ్గురిని గాయపరిచిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, కోర్టుకు పంపినట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన గరికపాటి వెంకటేశ్వరరావు, బావమరిది వాకా గంగాధరరావుకు ఆస్తికి సంబంధించిన వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వాకా గంగాధరరావు తన కుమారుడు ఓంకార్‌తో కలిసి గరికపాటి వెంకటేశ్వరరావు ఇంటికెళ్లి గొడవపడ్డాడు. ఓంకార్ పాలుగుతో, గంగాధరరావు సిమెంట్ రాయితో గరికపాటి వెంకటేశ్వరరావు, భార్య జయసుధ, తల్లి రమాదేవి తలపై కొట్టారు. తీవ్రగాయాలైన ముగ్గురిని ఉయ్యూరు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించారు. గరికపాటి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు గంగాధరరావు, ఓంకార్‌పై కేసు నమోదు చేసి శనివారం కోర్టుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

పన్ను బకాయిలకు వడ్డీ రాయితీ

గుడివాడ టౌన్: పురపాలక సంఘ పరిధిలో ఆస్తిపన్ను, నీటి కుళాయి, ఖాళీస్థలాల పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో సైతం ఈ బకాయిలు కట్టించుకుంటారని పేర్కొన్నారు.

అన్నా క్యాంటీన్ సమయాల్లో మార్పులు

పట్టణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌లు పనిచేయు సమయాలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి మార్చినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు అల్పాహారం, మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు భోజన సమయం, రాత్రి 7 గంటల నుంచి 8.30 వరకు కొనసాగుతాయని తెలిపారు.

పెరికెగూడెంలో డ్రెయినేజీ అభివృద్ధి పనులు

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో శనివారం డ్రెయినేజీ అభివృద్ధి పనులు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు డ్రెయినేజీల నిర్మాణం కీలకమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వైఎస్సార్ సీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



కైకలూరు: వైఎస్సార్ సీపీ అభివృద్ధిలో అల్లూరి సూర్యనారాయణరాజు(తాడినాడ సూర్యం) విశేష కృషి చేశారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఇటీవల మరణించిన సూర్యం దశ దిన కర్మ చిన తాడినాడలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులను పరామర్శించి సూర్యం చిత్ర పటానికి డీఎన్నార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి కూసంపూడి కనక దుర్గరాణి, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్ , జిల్లా యాక్టీవ్ సెక్రటరీ మహాదేవ విజయ్‌బాబు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గండికోట యేసుబాబు, యువజన విభాగ అధ్యక్షుడు ముంద్రు చార్లెస్, నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆనంద రవిరాజు పాల్గొన్నారు.

ఘనంగా అకౌంటెంట్స్ డే

గుడివాడ టౌన్: ది గుడివాడ డివిజన్ అకౌంటెంట్స్ అసోసియేషన్, కృష్ణా జిల్లా ట్యాక్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అకౌంటెంట్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐఎంఏ హాల్లో నిర్వహించిన సెమినార్‌లో సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ సూపరింటెండెంట్ చల్లా గాయత్రి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ గుడివాడ సర్కిల్ సతీష్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రభుత్వం విధానాలను వివరించారు. అనంతరం ప్రముఖ ఆడిటర్లు ఎంఆర్ ప్రసాద్, మండలి హనుమంతరావు, డి. శివకిషోర్, ట్యాక్స్ ప్రొఫెషనల్స్‌కు సూచనలు ఇచ్చారు. ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకట రమణ కుమార్, గుడివాడ అధ్యక్షుడు బి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏఎస్ఐ సారథికి ఎస్ఐగా ఉద్యోగోన్నతి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సారథిబాబు ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. శనివారం స్థానిక ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ సారథిని సన్మానించారు. సారథి ఎస్ఐగా ప్రమోషన్ పొంది డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్తున్నారు.

జీఓ 198ని రద్దు చేయండి

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆస్తి పన్ను పెంపునకు సంబంధించి జీఓ 198ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు ఆర్‌సీపీ రెడ్డి శనివారం విలేకరులతో మాట్లాడారు. 198వ జీఓ ప్రకారం ప్రతి 15 సంవత్సరాలకు ఒకసారి ఆస్తిపన్ను పెంచుకునే అవకాశం పురపాలక సంఘాలకు ఉందన్నారు. దీని వలన ప్రజలపై భారం పడుతుందన్నారు. దీనిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక పన్ను బకాయిల మీద 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పన్నుపై వడ్డీని పూర్తిగా రద్దుచేస్తే పన్ను చెల్లింపుదారులకు కొంత వెసులుబాటు ఉంటుందన్నారు.

పాఠశాల్లో ఉగాది వేడుకలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు పాఠశాలల్లో ఉగాది వేడుకలు శనివారం నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో శనివారమే ఉగాది వేడుకలు నిర్వహించారు. వాడవల్లి యూపీ స్కూల్లో హెచ్ఎం సాయిలక్ష్మీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. వేపపువ్వుతో ప్రసాదాన్ని తయారుచేసి పంపిణీ చేశారు. పెయ్యేరు, నరసన్నపాలెం పాఠశాలల్లో ఉపాధ్యాయులు బేతాళ రాజేంద్రప్రసాద్, ఆర్ శ్రీహరి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి.

రమణారావుకు అభినందనలు



కైకలూరు: కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పింఛనర్ల విభాగం అధ్యక్షుడిగా కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన విశ్రాంత మండల విద్యాశాఖాధికారి పట్టూరి వెంకటరమణారావు నియమితులయ్యారు. ఈ మేరకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నుంచి ఆదేశాలు అందాయి. చింతలపూడి నియోజకవర్గం అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా సేవ ధర్మదాస్ ఎంపికయ్యారు. వీరిని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అభినందించారు.

కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

కైకలూరు: పంచాయతీ కార్యాలయం ఎదురుగా 86 మంది కాంట్రాక్టు కార్మికులు శనివారం ఆందోళన బాట పట్టారు. ఇటీవల కాంట్రాక్టు పనులకు సంబంధించి సీల్డ్ కవర్ టెండర్లు జరిగాయి. తక్కువగా కోట్ చేసిన కాంట్రాక్టరుకు పనులు దక్కాయి. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది తమకు జీతాలు తగ్గించి ఇస్తారని, అందరినీ పాత జీతాలతోనే కొనసాగించాలంటూ ఆందోళన చేశారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, డీఎల్‌పీఓ చంద్రశేఖర్ శిబిరం వద్దకు వచ్చారు. డీపీఓ మాట్లాడుతూ కార్మికులను పనులకు రావద్దని ఎవరూ నోటీసులు ఇవ్వలేదన్నారు. నూతన టెండర్ల విధానం పాలకవర్గ సమావేశంలో ఆమోదించిన తర్వాతే అమలు జరుగుతుందన్నారు. పాలకవర్గ సభ్యులు నిరాకరిస్తే ఎందుకు నిరాకరించారనే విషయాన్ని తెలియజేయాలన్నారు. కాంట్రాక్టు సిబ్బంది రూల్ ప్రకారం జీతభత్యాలు కోరుతున్నారా? అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అనంతరం కార్మికులు ఆందోళన విరమించారు.

మెగా డీఎస్సీలో అవకాశం కల్పించండి

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు గ్రామంలోని ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో 2023–2025 రెండో సంవత్సరం చదువుతున్న ఛాత్రోపాధ్యాయులు మెగా డీఎస్సీలో తమకూ అవకాశం కల్పించాలని సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరారు. శనివారం ఈ విషయాన్ని స్థానిక డైట్ ఛాత్రోపాధ్యాయులు విలేకరులకు తెలియజేశారు. ప్రస్తుతం అకాడమిక్ ఈయర్ ఏప్రిల్ 23వ తేదీతో కోర్సు తమకు అయిపోతుందని పేర్కొన్నారు. ఇక్కడ చదువుతున్నవంటి ఛాత్రోపాధ్యాయులంతా పేద కుటుంబాల నుంచి వచ్చిన వారమేనన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చేటువంటి మెగా డీఎస్సీలో తమకు కూడా అవకాశం కల్పించాలని కోరారు.